సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్



న్యూస్‌రీల్

'పెన్ డౌన్'తో రిజిస్ట్రేషన్ సేవలకు బ్రేక్



ఖాళీగా దర్శనమిస్తున్న బుక్కపట్నంలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

పుట్టపర్తి: రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానాల్లో మార్పులు చేయాలన్న డిమాండ్‌తో దస్తావేజులేఖరులు పెన్‌డౌన్ చేయగా...శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల కార్యకలాపాలకు బ్రేక్ పడింది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది. ఈ సందర్భంగా పలువురు దస్తావేజు లేఖరులు మాట్లాడుతూ... రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన 2.0 విధానంలో చాలా లోపాలున్నాయన్నారు. వాటిని సరిచేయాలన్నదే తమ డిమాండ్ అన్నారు. శనివారం కూడా 'పెన్‌డౌన్' కొనసాగుతుందన్నారు.

22 నుంచి ఖాద్రీశుడి దసరా ఉత్సవాలు



శ్రీదేవి భూదేవి సమేత నారసింహుడు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 11 రోజుల పాటు ఉత్సవాలు సాగుతాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు 22వ తేదీ (సోమవారం) స్వామి వారు మత్స్యావతారంలో దర్శనమిస్తారన్నారు. 23న కూర్మావతారం, 24న నృసింహావతారం, 25న త్రివిక్రమ అవతారం, 26న రామావతారం, 27న కృష్ణావతారం, 28న పరమ పదనాథ అలంకారం, 29న సరస్వతి అలంకారం, 30వ తేదీన మోహినీ అవతారం, అక్టోబర్ 1వ తేదీన వెంకటేశ్వర స్వామి అవతారంతో లక్ష్మీ నారసింహుడు భక్తులకు దర్శన భాగ్యం కల్గిస్తారని వివరించారు. చివరిరోజైన అక్టోబర్ 2వ తేదీ విజయదశమి నాడు మధ్యాహ్నం 2 గంటలకు ఖాద్రీశుడు ఆలయం నుంచి బయలుదేరి రాయచోటి రోడ్‌లో ఉన్న దసరా మండపానికి వెళ్తారని, అక్కడ స్వామివారికి శమి పూజ, ఆస్థాన పూజ నిర్వహించిన అనంతరం అశ్వవాహనంపై గ్రామోత్సవంతో తిరిగి ఆలయానికి చేరుకుంటారని ఈఓ వెల్లడించారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

పుట్టపర్తి టౌన్: దసరా పండుగకు ముఖ్యమైన పట్టణాలు, నగరాల నుంచి స్వస్థలాలకు చేరుకునే వారి కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) మధుసూదన్ తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, చెన్నై నుంచి వచ్చే ప్రయాణికులు తిరిగి వెళ్లే వారి సౌకర్యార్థం ఈనెల 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఆదాయం రాని రూట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఆదాయం పెంచే విధంగా చూడాలని ఆదేశించారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులను శుభ్రంగా ఉంచాలన్నారు. కేఎంపీఎల్ పెంచేలా డ్రైవర్లకు అవగాహన కల్పించాలని సూచించారు.

డెంగీతో విద్యార్థిని మృతి



ఉత్ప్రేక్ష (ఫైల్)

వజ్రకరూరు: డెంగీతో విద్యార్థిని మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొనకొండ్ల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. కొనకొండ్ల గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి, నరసింహులు దంపతులకు ముగ్గురు కుమార్తెలు సంతానం. వీరి పెద్ద కుమార్తె ఉత్ప్రేక్ష (09) గ్రామంలోని కోట ప్రాథమిక పాఠశాలలో నాల్గో తరగతి చదువుతోంది. ఈ నెల 12న ఉత్ప్రేక్ష జ్వరం బారిన పడింది. తల్లిదండ్రులు మొదట కొనకొండ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిలో, తర్వాత గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేయించినా జ్వరం తగ్గలేదు. ఈ క్రమంలో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా డెంగీ సోకినట్లు డాక్టర్లు నిర్ధారించి.. ఆ మేరకు చికిత్సలు ప్రారంభించారు. అయితే, చికిత్స ఫలించక గురువారం సాయంత్రం ఉత్ప్రేక్ష మరణించింది.

ప్రైవేటుపై ప్రజాగ్రహం



చంద్రబాబు సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, నర్సింగ్ విద్యార్థినులు



'చలో మెడికల్ కాలేజీ' నిరసన కార్యక్రమంతో కిటకిటలాడుతున్న పెనుకొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిసరాలు

- మెడికల్ కళాశాలలను ప్రైవేటు వరం చేస్తే ఊరుకోం
- సర్కారును హెచ్చరించిన వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజలు
- మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడంపై మండిపాటు
- 'చలో మెడికల్ కాలేజీ' పేరుతో పెనుకొండలో ఆందోళన
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, విద్యార్థులు
- స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలిపిన ప్రజలు
- నిర్ణయం మార్చుకునే వరకూ ఉద్యమాలు కొనసాగిస్తామని వెల్లడి

సాక్షి, పుట్టపర్తి

చంద్రబాబు 'ప్రైవేటు' నిర్ణయంపై ప్రజాగ్రహం పెల్లుబుకింది. రూ.కోట్ల విలువైన మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో పరాధీనం చేసే సర్కార్ కుట్రపై జనాగ్రహం మిన్నంటింది. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ తలపెట్టిన 'చలో మెడికల్ కాలేజీ' కార్యక్రమం విజయవంతమైంది. పెనుకొండ మెడికల్ కళాశాల వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు, ప్రజలు, కార్యకర్తలు, నాయకులు వేలాదిగా పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మండిపడ్డారు. 'సీఎం డౌన్ డౌన్.. పాలన చేతగాకపోతే దిగిపోవాలి'' అంటూ నినాదాలు చేశారు.

నిప్పులు చెరిగిన నాయకులు..

63 ఎకరాల విస్తీర్ణంలో రూ.470 కోట్లతో నిర్మాణం కావాల్సిన పెనుకొండ మెడికల్ కళాశాలను పెత్తందార్లకు కట్టబెట్టేందుకు చంద్రబాబు నిర్ణయించడం దుర్మార్గమని పలువురు నాయకులు మండిపడ్డారు. మెడికల్ కళాశాల భవనాల వద్ద వారు మాట్లాడారు. నిరుపేదలకు మెరుగైన వైద్యం, పేద కుటుంబాల్లోని పిల్లలకు వైద్యవిద్యను దూరం చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. పెనుకొండ నుంచే ఓ మంత్రి, ధర్మవరం నుంచి ఆరోగ్య శాఖ మంత్రి ఉన్నప్పటికీ మెడికల్ కాలేజీల గురించి నోరు మెదకపోవడం దుర్మార్గమన్నారు. పెనుకొండలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను ఆపినా ఇద్దరు మంత్రుల్లో ఎలాంటి చలనం లేదన్నారు. 'నేను లోకల్' అని చెప్పుకొని తిరిగే మంత్రి సవిత పెనుకొండ నుంచి ప్రాతినిథ్యం వహిస్తోందనే విషయం మరిచారా? అంటూ ఎద్దేవా చేశారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్.. కనీసం ఓసారైనా మెడికల్ కాలేజీ పరిశీలించారా.. అని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీ నిర్మాణ బాధ్యతలు, నిర్వహణ ప్రభుత్వమే చూడాలని.. నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటిస్తే.. నేడు ప్రైవేటీకరణ చేసే హక్కు ఎవరు ఇచ్చారు చంద్రబాబూ అంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీమ్ అహ్మద్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రాయల్, మాజీ మంత్రి నర్సేగౌడ, యువజన విభాగం పెనుకొండ అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రెడ్డి, పుట్టపర్తి యువజన విభాగం అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా అగ్రి బోర్డు మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, పుట్టపర్తి యువనేత సత్యనారాయణచౌదరి, విద్యార్థి విభాగం నాయకులు ఎం.నరేంద్రరెడ్డి, వేముల అమర్‌నాథ్‌రెడ్డి, పెనుకొండ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ, పెనుకొండ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, చిలమత్తూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండ మెడికల్ కాలేజీ నిర్మాణ భవనంపైకి ఎక్కిన నాయకులు

ప్రైవేటు బాబు అనాలేమో



'చలో మెడికల్ కాలేజీ' కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబుకు కొత్తగా నామకరణం చేస్తున్నాం. ప్రతి విషయంలో ప్రైవేటు పెత్తనాన్ని ప్రోత్సహించే సీఎంను ఇక నుంచి 'ప్రైవేటు బాబు' అని పిలిస్తే బాగుంటుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల నుంచే ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది.

– టీఎస్ దీపిక, హిందూపురం సమన్వయకర్త

చంద్రబాబు నైజమే అంత



ప్రజా వ్యతిరేక పాలనే చంద్రబాబు నైజం. నాలుగుసార్లు సీఎం అయినా.. ప్రజలకు ఏం కావాలో తెలుసుకోలేని మనస్తత్వం ఆయనది. ప్రజలనాడి పట్టగలిగేది వైఎస్ కుటుంబం మాత్రమే. సీఎంగా వైఎస్ జగన్ నిర్ణయాలు దేశానికే ఆదర్శమని జనం అంటున్నారు.

– రమేశ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు



పెనుకొండ మెడికల్ కళాశాల వద్ద ధర్నాలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల అధ్యక్షులు అనంత, ఉష శ్రీ చరణ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, సమన్వయకర్తలు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, తలారి రంగయ్య, విశ్వేశ్వర రెడ్డి, టీఎస్ దీపిక, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

బాబుకు పేదల సంక్షేమం పట్టదు



సీఎం చంద్రబాబుకు పేదల సంక్షేమం పట్టదు. తన అనుయాయులు బాగుపడితే చాలనుకుంటారు. అందుకే ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకే మొగ్గుచూపుతారు. ఈ క్రమంలోనే మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధమయ్యారు. దీన్ని కప్పిపుచ్చేందుకు మంత్రి సవిత మెడికల్ కాలేజీ నిర్మాణ పనులే ప్రారంభం కాలేదని వ్యాఖ్యానించారు. ఇంతటి పెద్ద భవనాలు ఆమె కళ్లకు కనిపించలేదా..? కళ్లు లేని కబోదిలా ఓ మంత్రి మాట్లాడటం సిగ్గుచేటు. ఎంతోమంది విద్యార్థులు తక్కువ ఫీజుతోనే వైద్యవిద్యను పూర్తి చేయాలనే ఉద్దేశంతో నాడు సీఎం హోదాలో వైఎస్ జగన్ రూ.8 వేల కోట్లతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన చంద్రబాబు పరాధీనం చేసేందుకు సిద్ధపడటం దుర్మార్గం. వెంటనే తన నిర్ణయాన్ని మార్చుకోవాలి. లేకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తాం.

– జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు


హాఫ్ నాలెడ్జ్ మంత్రి సవిత



పెనుకొండలో నేను లోకల్ అని చెప్పుకొనే మంత్రి సవితకు స్థానికంగా ఉండే మెడికల్ కాలేజీ భవనాలు కనిపించవా? ఇక్కడ ఇంత పెద్ద భవనాలు నిర్మితమై ఉంటే ఎలాంటి భవనాలూ లేవంటూ రాళ్లు, గుట్టలు చూపిస్తూ తాను.. హాఫ్ నాలెడ్జ్ మంత్రి అని మరోసారి నిరూపించుకున్నారు. ఇక్కడున్న రెండంతస్తుల భవనం ఎక్కి దూకితే ఆమె కాళ్లు విరగకుంటే నిర్మాణాలు లేనట్లే. లేనిపక్షంలో మంత్రి బహిరంగ క్షమాపణలు చెప్పాలి. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసే ఆలోచనను విరమించుకోకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తాం.

– ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు

పెత్తందార్ల కోసమే..



ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన మెడికల్ కాలేజీలను తన చుట్టూ ఉండే పెత్తందార్లకు అప్పగించడం కోసమే చంద్రబాబు ప్రైవేటీకరణ మార్గం ఎంచుకుంటున్నారు. ప్రజలు ఏమైనా.. రాష్ట్రం ఏ గతిలో ఉన్నా... చంద్రబాబుకు అవసరం లేదు. తన వాళ్లు బాగుంటే చాలనుకుంటారు. గతంలో మూడుసార్లు సీఎంగా ఉన్నా.. ఏనాడూ మెడికల్ కాలేజీల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. వైఎస్ జగన్ ఒకేసారి 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుడితే.. నాల్గోసారి సీఎం అయిన చంద్రబాబు... ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తామని ప్రకటించడం దుర్మార్గం.

– అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు

ఏ రాష్ట్రంలోనూ లేదు



దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఒకేసారి 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టిన దాఖలాలు లేవు. కానీ జగనన్న ఆ ఘనత సాధించారు. నేడు రూ.కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను నారాయణ, చైతన్య వంటి ప్రైవేటు యాజమాన్యాలకు కట్టబెట్టేందుకే చంద్రబాబు ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకున్నారు. అసోంలో 12, కర్ణాటకలో 21, కేరళలో 11, తమిళనాడులో 32 ప్రభుత్వ మెడికల్ కాలేజీలున్నాయి. రూపాయికే వైద్యం చేసే వైఎస్సార్ లాంటి డాక్టర్లు రావాలంటే మెడికల్ కాలేజీలు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండాలి. అదిఇష్టం లేకనే చంద్రబాబు కాలేజీలను ప్రైవేటు పరం చేయాలనే నిర్ణయం తీసుకున్నారు.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే

కళ్లు లేని వారిలా మాట్లాడకండి



పెనుకొండలో ఇంత పెద్ద మెడికల్ కాలేజీ నిర్మాణం కళ్లముందు కనబడుతుంటే .. నిర్మాణాలే ప్రారంభించలేదని మంత్రి సవిత వ్యాఖ్యానించడం హాస్యాస్పదం. కళ్లు లేని కబోదుల్లా కూటమి పాలకులు మాట్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కూడా కాకముందే ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత మొదలైంది. ఆయా పార్టీల నేతలు ప్రజల్లోకి వెళ్లలేని స్థితిలో ఉన్నారు.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్ పర్సన్, అనంతపురం

ఉద్యమాలు ఉధృతం చేస్తాం



పీపీపీ విధానంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం, విద్య ప్రభుత్వ కనీస బాధ్యత. అందుకే గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారు. కానీ నేడు చంద్రబాబు పేదలకు అన్యాయం చేసేలా 'పీపీపీ' రాగం అందుకున్నారు. వెంటనే ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోవాలి. లేదంటే ప్రజలతో కలిసి ఉద్యమాలు ఉధృతం చేస్తాం.

– మక్బూల్, కదిరి నియోజకవర్గ సమన్వయకర్త

చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలి



మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని చంద్రబాబు వెంటనే వెనక్కుతీసుకోవాలి. పీపీపీ విధానంతో ఉచిత వైద్యం అందదేమోనన్న ఆందోళన అందరిలోనూ ఉంది. అందువల్లే వైఎస్సార్ సీపీ పిలుపుతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. ఇకనైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలి. ప్రజలకు మంచి జరిగే నిర్ణయాలు తీసుకోవాలి. పేదల పక్షాన నిలిచేది వైఎస్సార్‌సీపీ మాత్రమే.

– ఈరలక్కప్ప, మడకశిర సమన్వయకర్త

పోరుబాట తప్పదు



మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గపు ఆలోచన. రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న సీఎం చంద్రబాబు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదు. వెంటనే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకోవాలి. ఆయన తన నిర్ణయం మార్చుకునే వరకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నాం.

– గంగుల సుధీర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

ఉప్పొంగిన 'చిత్రావతి'



పెడపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది



కొడికొండ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి

- తాజా వర్షాలతో పరవళ్లు తొక్కుతున్న నది
- మరువ పారుతున్న పరగోడు డ్యాం

పుట్టపర్తి అర్బన్/చిలమత్తూరు: రెండు రోజులుగా కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు చిత్రావతి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. నంది కొండ నుంచి పరవళ్లు తొక్కుతూ బాగేపల్లి వద్ద ఉన్న పరగోడు డ్యాం చేరుతోంది. ప్రస్తుతం డ్యాం నిండిపోగా మరువపారుతోంది. అక్కడి నుంచి కొడికొండ, శెట్టిపల్లి, బూదిలి, గోరంట్ల మీదుగా పెడపల్లి, రాయలవారిపల్లి, కర్ణాటక నాగేపల్లి, పుట్టపర్తి మీదుగా ప్రవహించి బుక్కపట్నం చెరువు చేరుతుంది.

రాకపోకలకు అంతరాయం..

చిలమత్తూరు మండలంలో కొడికొండ, సుబ్బరావుపేట, శెట్టిపల్లి వద్ద చిత్రావతి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సుబ్బరావుపేట, కొడికొండ, సోమఘట్ట, మొరసలపల్లితో పాటు పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి.

20 మండలాల్లో వర్షం..

తుపాను ప్రభావంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ జిల్లాలోని 20 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అమడగూరు మండలంలో అత్యధికంగా 30.8 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. ఇక బుక్కపట్నం మండలంలో 30.2 మి.మీ, కొత్తచెరువు 18.6, ఎన్పీకుంట 18.0, తనకల్లు 16.2, గోరంట్ల 15.2, చిలమత్తూరు 14.6, లేపాక్షి 11.4, ఓడీచెరువు 7.2, పుట్టపర్తి 5.8, నల్లచెరువు 5.4, అగళి 4.2, కదిరి 3.2, బత్తలపల్లి 2.6, నల్లమాడ 2.4, గాండ్లపెంట 2.0, ముదిగుబ్బ 1.8, తలుపుల 1.8, హిందూపురం 1.8, పరిగి మండలంలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాకు మరో రెండురోజులూ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అధికారులకు కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశం

ప్రశాంతి నిలయం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పేదల అభ్యున్నతికి అధికారులు పనిచేయాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమం, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలన్నారు. బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన గదుల్లో తరగతులు నిర్వహించకూడదన్నారు. దివ్యాంగులకు కృత్రిమ అవయవ పరికరాలను అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.

స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర పక్కాగా నిర్వహించాలి

ప్రతి మూడో శనివారం 'స్వచ్ఛాంధ్ర –స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులతో వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్

క్లుప్తంగా

23న జాబ్‌మేళా



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రశాంతి నిలయం: ఈ నెల 23న మడకశిరలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన విడుదల చేసి, మాట్లాడారు. 23న ఉదయం 9 గంటలకు మడకశిరలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. 11 బహుళజాతి కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఆయా కంపెనీలకు అవసరమైన మానవ వనరులను ఎంపిక చేస్తారన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పీజీ చదివి.. 35 సంవత్సరాల లోపు వయసున్న వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డ్, రెండు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూల్చరు.. అక్రమం తేల్చరు!

పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామంలో డిజిటల్ లైబ్రరీకి కేటాయించిన స్థలానికి నకిలీ పట్టాలు సృష్టించి.. అక్రమంగా నిర్మించిన భవనం ఇది. ఈ భవనాన్ని చూపి బ్యాంకుల్లో రుణాలు కూడా పొందారు. ఈ అక్రమ నిర్మాణంపై 'సాక్షి' కథనం ప్రచురించగా.. భవన నిర్మాణం చేపట్టిన మహిళకు అధికారులు నోటీసు పంపారు. స్పందన లేకపోవటంతో ఈనెల 16వ తేదీన ఆ అక్రమ కట్టడం కూల్చివేసేందుకు ఆర్డీఓ సువర్ణ ముహూర్తం ఫిక్స్ చేశారు. కానీ ఎందుకనో ఆమె నిర్ణయం వాయిదా పడింది. దీని వెనుక కూటమి పార్టీలకు చెందిన ఓ కీలక నేత అండ ఉన్నట్లు తెలుస్తోంది.



అక్రమ కట్టడం ఇదే

- పెడపల్లిలో అక్రమ భవనం
- కూల్చేందుకు అధికారుల నిర్ణయం
- అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చిన మాజీ మంత్రి
- హఠాత్తుగా నిర్ణయం మార్చుకున్న అధికారులు

సాక్షి, పుట్టపర్తి కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అధికార పార్టీ నాయకుల దోపిడీకి అడ్డే లేకుండా పోయింది. చివరకు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి దర్జాగా భవంతులు నిర్మిస్తున్నారు. అడ్డొచ్చిన అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నారు. దీంతో ఉద్యోగ భద్రత భయంతో కూటమి నేతల కనుసన్నల్లోనే అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. పెడపల్లి గ్రామంలో ఓ టీడీపీ నాయకుడు తన భార్య పేరుతో ప్రభుత్వ భూమికి పట్టా పుట్టించి డిజిటల్ లైబ్రరీకి కేటాయించిన స్థలంలో కట్టిన భవనమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

పెడపల్లిలో అక్రమ కట్టడం

పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామం నుంచి నిడిమామిడి వెళ్లే మార్గంలో ప్రభుత్వ స్థలంలో టీడీపీకి చెందిన ఓ కీలక నేత తన బంధువుల పేరిట నకిలీ పట్టా తయారు చేసి అక్రమంగా భవనం నిర్మించాడు. దీనిపై పలు అభ్యంతరాలు వ్యక్తం కావడంతో పాటు పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు విచారణ చేపట్టారు. టీడీపీ నేత పట్టా సృష్టించిన భూమిని డిజిటల్ లైబ్రరీకి కేటాయించినదేనని గుర్తించారు.

కూల్చివేతకు ఆదేశాలు

ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు భవనం నిర్మిస్తున్నట్లు తేలడంతో సెప్టెంబరు 16న ఆ భవనం కూల్చివేస్తున్నట్లు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల నుంచి నేడో.. రేపో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టిన భవనాన్ని కూల్చివేస్తారని గ్రామస్తులు భావించారు. అయితే ఉన్నఫలంగా అధికారులు నిర్ణయం మార్చుకున్నట్లు తెలిసింది.

అక్రమార్కులకు మాజీ మంత్రి అండ

పెడపల్లి గ్రామంలో భూకబ్జాలకు పాల్పడే 'ఖల్‌నాయక్' టీడీపీలో కీలక నేతగా ఉన్నారు. అంతేకాకుండా ఓ మాజీ మంత్రికి అత్యంత సన్నిహితుడు కావడంతో ఆ భవనం కూల్చేందుకు అధికారులు ఆలోచిస్తున్నారు. ఆ మాజీ మంత్రి నుంచి అధికారులకు ఫోన్ వెళ్లినట్లు సమాచారం. దీంతో భవనం కూల్చివేత పడినట్లు తెలుస్తోంది.

కూటమి నేతల పచ్చ కుట్ర

- కుంటిమద్ది జగనన్నకాలనీలో నిరుపేదలకు పంచిన పట్టాలను మరొకరికి పంచుతున్న వైనం



కుంటిమద్ది జగనన్న కాలనీలో చదును చేస్తున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: గత ప్రభుత్వంలో రామగిరి మండలం కుంటిమద్ది గ్రామ జగనన్న కాలనీలో నిరుపేదలకు పంపిణీ ఇంటి పట్టాలను అధికారం అడ్డుపెట్టుకుని టీడీపీ నేత, మాజీ ఎంపీపీ రంగయ్య ఆధ్వర్యంలో ఇతరులకు పంపిణీ చేసే కుట్రకు తెరలేపడం కలకలం రేపుతోంది. గ్రామంలోని సర్వే నంబర్ 394–5బీ లో ఎకరా విస్తీర్ణంలో 41 మంది నిరుపేదలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒకటిన్నర సెంటు చొప్పున ఇంటి పట్టాలను పంపిణీ చేసింది. పక్కా గృహ నిర్మాణాలను సైతం మంజూరు చేసి, కాలనీలో మౌలిక వసతులు కల్పించింది. ఈ నేపథ్యంలో తమ ప్రభుత్వంలో తామేమీ చేసినా చెల్లుబాటవుతుందని భావించిన టీడీపీ నేతలు చెలరేగిపోయారు. నిరుపేదల స్థలాలపై కన్నేసి పరిటాల కుటుంబం అండతో శుక్రవారం జేసీబీతో చదును చేసే పనులు చేపట్టారు. విషయాన్ని గమనించిన గ్రామస్తుల్లో ఆందోళన మొదలైంది. కాగా, ఇంటి పట్టాలను ఇతరులకు పంపిణీ చేస్తే లబ్ధిదారులతో కలసి జిల్లా కేంద్రంలో ఆందోళనలు చేపడతామని మండల వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ రమేష్, సర్పంచ్ నరేంద్ర, జెడ్పీటీసీ నాగార్జున, యూత్ కన్వీనర్ మణికంఠ హెచ్చరించారు. ఇదే విషయంపై తహసీల్దార్ రవికుమార్‌ను వివరణ కోరగా... ఇంటి పట్టాల కోసం సర్వే చేపడుతున్నామని, ఈ క్రమంలో ఖాళీ స్థలాల గుర్తింపు కోసం భూమిని చదును చేస్తున్నట్లుగా పేర్కొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చేయి చేసుకున్న విద్యార్థి

- అనంతపురం జిల్లా శెట్టూరు మోడల్ స్కూల్‌లో ఘటన

నా కుమారుడి తప్పేమీలేదు..

నా కుమారుడు తప్పేమీ లేదు. ప్రిన్సిపాల్ శ్రీరాములు చేయి చేసుకోవడం వల్లే మావాడు వాదించాడు. – సునీతమ్మ, విద్యార్థి తల్లి

శెట్టూరు: సమాజంలో గురువుకు ప్రత్యేక స్థానం ఉంది.గురువును మించిన దైవం లేదని భావించే దేశం మనది. అలాంటి గురువుకు తన శిష్యుడి నుంచి తీవ్ర అవమానం జరిగింది. ప్రిన్సిపాల్‌పై విద్యార్థి దురుసుగా ప్రవర్తిస్తూ చేయి చేసుకున్నాడు. ఈ సంఘటన శెట్టూరు మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్లో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తెలిపిన వివరాల మేరకు.. పాఠశాలలో ఉదయం ప్రార్థన సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ సమయంలో ప్రిన్సిపాల్ శ్రీరాములు యూనిఫాం, షూ ధరించని విద్యార్థులను పక్కన నిల్చోవాలని సూచించారు. అయితే షూ ధరించని పదో తరగతి విద్యార్థి 'నాకే చెప్తావా' అంటూ వింత శబ్దంతో ప్రిన్సిపాల్‌ను హేళన చేశాడు. ఈ క్రమంలోనే సదరు విద్యార్థిపై ప్రిన్సిపాల్ చేయి చేసుకోగా.. ఆగ్రహించిన విద్యార్థి ప్రిన్సిపాల్ గొంతు పట్టుకుని దాడి చేశాడు. ఉపాధ్యాయులు జోక్యం చేసుకుని గొడవను అడ్డుకున్నారు. అవమానాన్ని తాళలేక ప్రిన్సిపాల్ కన్నీటి పర్యంత మయ్యారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు, డీఎస్పీ రవిబాబు, ఎంఈఓ శ్రీధర్ పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. చరణ్ ప్రవర్తన ముందు నుంచీ దురుసుగానే ఉందని, గతంలో ఒక టీచర్‌ను బెదిరించాడని, గణితం టీచర్ పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు తమ విచారణలో తేలిందని డిప్యూటీ డీఈఓ మీడియాకు వెల్లడించారు. పాఠశాలలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు విద్యార్థిపై పోలీసు కేసు నమోదు చేయించడంతో పాటు టీసీ ఇచ్చి పంపనున్నామని పేర్కొన్నారు.

ఇదే తరహాలో మరికొందరు విద్యార్థులు

ఏపీ మోడల్ పాఠశాలలో చరణ్‌తో పాటు మరికొందరు విద్యార్థులు దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలింది. కొందరు విద్యార్థులకు తాగుడు, గుట్కా అలవాట్లు ఉన్నట్లు, ఉపాధ్యాయులతో పాటు తోటి విద్యార్థినులతో దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు గుర్తించారు. ఇలాంటి విద్యార్థులకు వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు డిప్యూటీ డీఈఓ తెలిపారు.

ఈ -పాస్ యంత్రాల పంపిణీ



ఈ -పాస్ యంత్రాలను పంపిణీ చేస్తున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: ప్రభుత్వం మంజూరు చేసిన నూతన ఈ–పాస్ యంత్రాలను శుక్రవారం డీలర్లకు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డివిజన్ల వారీగా షెడ్యూల్ ప్రకటించి, పాత యంత్రాలను స్వీకరించి, వాటి స్థానంలో కొత్త ఈ–పాస్ యంత్రాలను అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్‌కు సచివాలయ ఉద్యోగుల వినతి



కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ధర్మవరం: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చడంతో పాటు సమస్యలన్నీ పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులు కలెక్టర్‌ను కోరారు. శుక్రవారం పలువురు సచివాలయ ఉద్యోగులు కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను కలిశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ... గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ కాలానికి సంబంధించిన రెండు నోషనల్ ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలని, ప్రమోషన్ లేకుండా ఒకే కేడర్‌లో ఆరేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆటోమెటిక్ అడ్వాన్స్‌డ్ స్కీమ్ కింద ఒక స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్‌ను మంజూరు చేయాలన్నారు. ప్రొబేషన్ ఆలస్యం కావడం వల్ల సచివాలయ ఉద్యోగులు 9 నెలలకు సంబంధించిన బకాయిలు కోల్పోయారన్నారు. ఇంటింటికీ తిరిగి చేసే సేవలు, సర్వేల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. ప్రతి శాఖకు సంబంధించిన సీనియార్టీ జాబితాల విడుదల చేయాలన్నారు. ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే సమ్మెలోకి వెళ్తామన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ సీఐ విశ్వనాథచౌదరి (చిత్రంలో) ఎస్‌ఈ సంపత్‌కుమార్

ధర్మవరం అర్బన్: విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా గట్టి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆ శాఖ ఎస్‌ఈ సంపత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం పుట్టపర్తి డివిజన్‌లోని డీఈలు, ఏఈలు, విద్యుత్‌శాఖ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆ శాఖ సీఐ విశ్వనాథ్‌చౌదరితో కలసి ఆయన మాట్లాడారు. పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలను రైతులు ఎక్కడం, అనుమతి లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేయడం, విద్యుత్‌ను ఆఫ్ చేయడం, ఆన్ చేయడం లాంటి ఘటనలు ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. ఈ విషయంగా రైతులకు, గ్రామీణులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గంగాధర్, ఏడీఈ లక్ష్మీనరసింహారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరాం, చెన్నేకొత్తపల్లి డీఈ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని దుర్మరణం



ప్రకృతి (ఫైల్)

పావగడ: ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ విద్యార్థిని దుర్మరణం పాలైంది. మరో విద్యార్థినికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... పావగడలోని ఆదర్శ నగర్‌లో ఉంటున్న ప్రకృతి (17) వివేకానంద స్వామి కళాశాలలో పీయూసీ చదువుతోంది. ఈ క్రమంలో తన సహ విద్యార్థిని ప్రేరణతో కలసి శుక్రవారం సాయంత్రం స్కూటీ వాహనంపై ట్యూషన్‌కు వెళుతుండగా జపానందస్వామి ఆస్పత్రి ఎదుట ప్రధాన రోడ్డుపై వేగంగా దూసుకొచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. స్కూటీ వెనుక కూర్చొని ఉన్న ప్రకృతి కిందకు పడడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన ప్రేరణను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ సురేష్.. ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ పరారీలో ఉన్నట్లుగా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భర్తను హతమార్చిన భార్య

- ఆరునెలల తర్వాత విచారణలో వెలుగు చూసిన ఉదంతం



రామన్న (ఫైల్)

మదనపల్లె రూరల్: మద్యం మత్తులు భౌతిక దాడులకు పాల్పడుతూ కూలి డబ్బులు లాక్కొని వెళ్లే భర్త వేధింపులను భరించలేని భార్య, తన తమ్ముడి సాయంతో హత్య చేసిన ఉదంతం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సంఘటన జరిగిన ఆరు నెలల తర్వాత నిందితులను పోలీసులు గుర్తించారు. వివరాలను మదనపల్లె టూటౌన్ పోలీసులు శుక్రవారం వెల్లడించారు. శ్రీసత్యసాయిజిల్లా తనకల్లు మండలం నందివారిపల్లెకు చెందిన జరిపిటి రెడ్డెప్ప కుమారుడు రామన్న(40), రమణమ్మ దంపతులు ఉపాధి కోసం మదనపల్లెకు వలస వచ్చారు. రామారావుకాలనీలోని ఓ అద్దె ఇంటిలో నివాసముంటూ కూలి పనులతో జీవనం సాగించేవారు. కొద్ది కాలం తర్వాత మద్యానికి బానిసైన రామన్న ఇంట్లో భార్యతో గొడవపడేవాడు. మద్యం తాగేందుకు అవసరమైన డబ్బులు భార్య నుంచి లాక్కొని వెళ్లేవాడు. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చి 12న మధ్యాహ్నం పూటుగా మద్యం తాగి ఇంటికి చేరుకున్న రామన్న తన భార్యతో గొడవపడ్డాడు. అప్పటికే అతడి వేధింపులు భరించలేని ఆమె కర్రతో దాడి చేసింది. కిందపడిన అతడి తలపై రమణమ్మ తమ్ముడు ఈశ్వర్ రోకలి బండతో కొట్టడంతో రెడ్డెప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి గుట్టు చప్పుడు కాకుండా ఓ సంచిలో మూట గట్టి బి.కొత్తకోట సమీపంలోని కస్తూర్బా స్కూల్ సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువ వద్ద పాతిపెట్టారు. అనంతరం ఏమీ తెలియనట్లు ఇంటికి చేరుకున్నారు. అయితే తన అన్న కనిపించకపోవడంపై వదిన రమణమ్మ, ఆమె తమ్ముడు ఈశ్వర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ రెడ్డెప్ప సోదరుడు చేసిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసిన లోతైన దర్యాప్తు చేపట్టారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో హత్య చేసినట్లుగా అంగీకరించారు. బి.కొత్తకోటలో పాతిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా చేశారు.

మద్యం మత్తులో విషం తాగి..

రొళ్ల: మద్యం మత్తులో విషం తాగి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రొళ్ల మండలం హొట్టేబెట్ట గ్రామానికి చెందిన నాగప్ప, మారక్క దంపతులకు ముగ్గురు కుమారులు కాగా, మూడో కుమారుడు మారన్న మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం మత్తులో ఇంటికి చేరుకునే వాడు. ఈ క్రమంలో ఈ నెల 11న మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న మారన్నను.. కుటుంబ సభ్యులు మందలించారు. ఆ సమయంలో తాగిన మైకంలో నీళ్లు అనుకుని పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. తొమ్మిది రోజుల అనంతరం పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



డేవిడ్ ప్రశాంత్‌కుమార్ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. చెన్నేకొత్తపల్లికి చెందిన డేవిడ్ ప్రశాంత్‌కుమార్ (60)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కనగానపల్లి మండలం మామిళ్లపల్లి వద్ద హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం భార్య శైలజాతో కలసి ద్విచక్ర వాహనంపై చెన్నేకొత్తపల్లికి చేరుకుని, భార్యను వదిలి పనిపై రిజిస్టర్ కార్యాలయానికి బయలుదేరాడు. 44 జాతీయ రహదారి వద్దకు చేరుకోగానే పెనుకొండ వైపు నుంచి దూసుకొచ్చిన టిప్పర్ ఢీకొని ఈడ్చుకెళ్లింది. అదే సమయంలో డేవిట్ ప్రశాంత్‌కుమార్ మీదుగా టిప్పర్ చక్రాలు వెళ్లడంతో మృతదేహం గుర్తు పట్టేందుకు వీలు లేకుండా ఛిద్రమైపోయింది. అయినా డ్రైవర్ టిప్పర్‌ను ఆపకుండా కొద్ది దూరం అలాగే ముందుకెళ్లడంతో చక్కాల కింద చిక్కుకున్న ద్విచక్ర వాహనం నుంచి మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న రామగిరి సీఐ శ్రీధర్, సీకే పల్లి ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. మృతుడి భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి కుటుంబానికి డీఎంహెచ్‌ఓ పరామర్శ



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం

ముదిగుబ్బ: మండల కేంద్రంలో విషజ్వరంతో మృతి చెందిన విద్యార్థి షాహిద్ కుటుంబసభ్యులను శుక్రవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం పరామర్శించారు. నెల రోజులుగా జ్వరంతో బాధపడుతున్న బాలుడు.. మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ వల్ల మృతి చెందాడని ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ వివరించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంఓ ఓబులు, డాక్టర్ శ్వేత, సీహెచ్‌ఓ వన్నప్ప, మలేరియా సబ్‌యూనిట్ అధికారి దేవలా నాయక్, హెల్త్ సూపర్‌వైజర్ శశిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

కదిరి టౌన్: స్థానిక నిజాంవలీ కాలనీకి చెందిన రోషన్‌వలిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. అదే కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఎనిమిదేళ్ల బాలికను శుక్రవారం రోషన్‌వలి తన ఇంట్లోకి పిలుచుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నీళ్ల ట్యాంకు ఎక్కి కిందకు దూకి..

ధర్మవరం అర్బన్: స్థానిక సిద్దయ్య గుట్టకు చెందిన రమేష్.. శుక్రవారం నీళ్ల ట్యాంకు ఎక్కి కిందకు దూకాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అతని పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు తెలిపారు. కాగా, మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి సమీపంలో ఉన్న నీళ్ల ట్యాంకు మెట్లు ఎక్కి కిందకు దూకినట్లుగా వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

కూలిన బతుకులు

రాప్తాడురూరల్: మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనే లోపే టైల్స్ పని చేసే దినసరి కూలీలను మృత్యువు కబళించింది. అనంతపురం రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగరానికి చెందిన ముత్తాం బాషా (32), కుమార్ (23) టైల్స్ కార్మికులుగా పని చేస్తున్నారు. వీరిలో ముత్తాం బాషాకు వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం సాయంత్రం గార్లదిన్నె సమీపంలో ఓ భవనంలో టైల్స్ పని ముగించుకుని ఇంటికి బయలుదేరారు. సోములదొడ్డి సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి లారీ ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన వారి మీదుగా లారీ వెనుక చక్రాలు దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందారు. లారీని రోడ్డుపైనే నిలిపి డ్రైవరు పరారవడంతో ట్రాఫిక్ స్తంభించింది. రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శేఖర్, సిబ్బందితో అక్కడకు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న రైతు శ్రీనివాసులు

నల్లమాడ: మండలంలోని మసకవంకపల్లి సమీపంలో రైతులు తమటం రామ్మోహన్, శ్రీనివాసులు తమ భూముల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసుకున్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైరు, ఆయిల్ అపహరించారు. బాధిత రైతుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించి కేసు నమోదు చేశారు.